

# నేనూ కర్ణుడినే

''నేనూ కర్ణుడినే!''

బీరు సేవిస్తున్న సలీమ్‌కు పొలమారింది, చేతిలో గ్లాసు జారింది. ఉలిక్కిపడి సురేష్ వంక చూశాడు రాజేందర్ రెడ్డి. ఆలూ చిప్స ఆబగా తింటున్న నేను ఆగిపోయాను ఠక్కున. ''దరిద్రపు వెధవ! వీడెప్పుడూ ఇంతే! తుపాకీ లేకుండా తూటాలొదుల్తాడు''. గ్లాసూ, బీరూ నేలపాలయ్యాయన్న ఉక్రోశం సలీం గొంతులో భగ్గుమంది.

''మొదటి రౌండ్ పూర్తిగాకుండానే కిక్కెక్కిందేమిట్రా?'' అయోమయంగా పరామర్శించాడు రాజేందర్.

''ఎందుకలా అన్నావ్?'' కనుబొమ్మలు ముడేసుకొని సాలోచనగా అడిగాన్నేను. వాడు వెంటనే జవాబు చెప్పలేదు.

ప్రతి ఆదివారం కాకున్నా నెలలో రెండు ఆదివారాలైనా, సరదాగా ఇలా అనంతగిరి గుట్టమీద కాలక్షేపం చేయడం గత రెండు సంవత్సరాలుగా అలవాటైంది మాకు. అందరమూ సంసారులమే. దారులు వేరైనా కూడలిలో కలిసినట్లు ఓ శుభముహూర్తాన కలుసుకున్నాం.

సురేష్‌కు కిరాణాకొట్టుంది. ఉమ్మడి సంసారం, వ్యాపారం. ఎదిగొచ్చిన తమ్ముళ్ళున్నారు. నిజానికి ఆదివారం వాడికి పని తెమల్దు సంతకదా! అయినా

నెలలో రెండ్రోజులు నాగా. మా ముగ్గురి పద్దులూ వాడి దగ్గరే. ఒక రకంగా మిగతా ఇద్దర్నీ వాడికి పరిచయం చేసింది నేనే. మేము బాల్య మిత్రులం.

రెండో వాడు సలీమ్. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. తెలుగు పట్ల విపరీతమైన ప్రేమ! నేనూ హిందూనని బహిరంగంగా చెబుతుంటాడు. అదేంటని ఎదురు ప్రశ్నిస్తే ''హిందుస్తాన్ మే రహనే వాలే హిందూ నహీతో కౌన్ హై?'' అని ఎదురు ప్రశ్న వేస్తాడు. మత సిద్ధాంతాల్ని పాటిస్తాడు. మనుషుల్ని ప్రేమిస్తాడు. వాడిదో ప్రత్యేకమైన పర్సనాలిటీ. అందుకే తొందరగా, విడదీయరాని బంధమైపోయాడు మా చతుష్టయంలో. గేదెకు నాలుగు కాళ్ళు లేవంటే ఒప్పుకోవచ్చు. గానీ మీరు నలుగురూ కలిసిలేరనే మాట మాత్రం నమ్మలేం! అని చమత్కరిస్తూంటాడు సురేష్ తమ్ముడు యోగేశ్ అప్పుడప్పుడు.

మూడోవాడు రాజేందర్ రెడ్డి. ఆర్.టి.సి.లో సెక్యూరిటీ గార్డు. ఏదో సాహితీ సమావేశంలో కలిసాడు. మంచి కంఠస్వరముంది. సహజంగానే అవకాశాన్ని బట్టి పాడాలనే దుగ్దా ఉంది. కిక్కెక్కితే వాడ్ని పట్టుకోలేం. రసాలన్నీ ఒలికిపోతాయి వాడి గొంతులో అలవోకగా. ట్రాన్స్‌ఫర్ మీద ఇక్కడికి ఇచ్చిన కొత్తలోనే పరిచయమయ్యాడు.

కాళ్లకు చక్రాలున్న ఉద్యోగం నాది. రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్. 'బావిలోరాయి'గా మా చతుష్టయంలో నాకు పేరొచ్చేసింది. రోజూసాయంత్రం ఈ మిత్రత్రయం స్టేషనుకి రావడం. నేనున్నాలేకున్నా సరదాగా నాలుగోప్లాటుఫారం చివరి బెంచీ మీద ఓ గంటసేపు కూర్చోవడం. ఊరూ-వాడా, దేశం-లోకం, సాహిత్యం-సంగీతం.... ఇలా అంతూ పొంతూ లేని ప్రపంచాన్నంతా చూసుకొని ఇళ్లకు వెళ్లిపోవడం షరా. అయితే నలుగురం కలుసుకొని కూర్చునే అవకాశాలు మాత్రం చాల అరుదుగా లభించేవి. నేనూ, రాజేందర్ డుమ్మాల మేష్టార్లం ఎప్పుడూ.

అందరమూ నాలుగో దశకంలో గిరికీలు కొడ్తున్న'వయస్సు' వాళ్లమే కాబట్టి ప్రేమ వాసనలు నిత్యం మా కబుర్ల లో గుభాళించేవి.

'' ఆరోగ్యమేమైనా పాడైందా కన్నా?'' శ్లేష ప్రశ్న విసిరాడు సలీం- మౌనంగా ఉన్న సురేష్‌ను చూసి.

'' ఒరే పండితుండా! అసలు కర్ణుడంటె ఎవర్రా?'' ఒక్క సిప్ లాగించి సూటి బాణం వేశాడు సురేష్.

''ద్రౌపదికి అయితే ఆరోమొగుడు. కుంతికి మాత్రం మొదటి కొడుకు'' కొరుకుడు పడకుండా జవాబులు చెప్పే ఘటికుడు సలీం.

'' ఇంక?'' మరో సిప్-సురేష్.

నేనూ కొంత క్లారిఫికేషన్ ఇచ్చా.

''అరే అయ్యన్నీ అడికి దెలుసు. ఇప్పుడు సినిమాలోళ్లు, పాస్కాల్ రాసేవోళ్లందరూ చెప్పే మాటలు- కర్ణుడంటే కనిపారేసిన యదవనాకొడుకనే అర్థం!'' సురేష్ ప్రశ్నకు సూటి సమాధానం - రాజేందర్.

''అబ్బ! ఏం జెప్పావు గురూ! హేట్సాఫ్!'' గాలిలోనే టోపీ తీసిన యాక్షన్ చేశాడు సురేష్.

''మరి నువ్వు కర్ణుడంటావేరా? కన్న వాళ్లనింట్లో ఉంచుకొని, దున్నలాగా పెరుగుతూ...'' చిరాకుతో కూడిన మందలింపునాది.

''అక్కడే అన్నా అందరూ పొరబడ్తున్నారు. కర్ణుడనగానే కనిపారేసిన దిక్కుమాలిననోడని, కృష్ణుడునగానే పదిమందితో సంసారం జేసేటోడని, ధర్మరాజనంగానే అవల నా కొడుకని... ఇట్లా ముద్ర లెయ్యడమేనా? ఇంకా వీళ్లకు వేరే లక్షణాలేమీ లేవా?'' మళ్లీ సిప్ - సురేష్.

ముగ్గురమూ ఆలోచనల్లో పడ్డాం.

'' ఏ తీరుగా నువ్వు కర్ణుడివయ్యా? వ్యాపారోత్తమ చెపుమా'' త్యాగరాజుకు పేరడీ పాడాడు రాజేందర్. అవకాశాన్ని జారవిడవకుండా.

మరో సిప్ లాగించి మొదలెట్టాడు వాడు స్టీమ్ ఇంజనులా నెమ్మదిగా ప్రారంభమైంది వాడి కథనం...

''డిగ్రీ చదివే రోజుల్లో నేను పీఠభూమిలా ఉండేవాడిని. ఈ మధ్య ప్రదేశం (బాన) ఈ మధ్యనొచ్చిందే గ్లామర్ కింగ్‌గా పేరుపొందలేకున్నా గుర్తింపున్న ఫిగర్‌గా నలుగురి నోళ్లలో మనపేరే.''

అన్న (నన్నుద్దేశ్యించి) మాకన్నా ఒక్క సం॥ సీనియర్. అప్పుడీయన ఫైనల్‌లో ఉన్నాడు.

''కొత్తగా చేరిన సుభద్రను ఫస్ట్‌టైం చూడగానే మనసుపడిపోయింది.''

ప్రేమకథ అని తెలియగానే మేమంతా శ్రవణేంద్రియాలను ఎలర్ట్ చేశాం. వాడు మరోసిప్ తీసుకున్నాడు.

'' ఎంత బ్యూటిఫుల్ ఫిగరన్నా! ఇప్పటి హీరోయిన్లూ ఎవరూ ఆమెకు సరి రారనుకో!''

''ఓయ్! వర్ణనలాపి అసలు కథ జెప్పు''-సలీం అసహనం.

''రోజూ కాలేజికి తనొచ్చేటైం కంటె పదినిముషాలు ముందేరావాలి. గార్డెన్‌లో కూర్చోవాలి. ఆ పదినిముషాలూ పదిగంటలౌతున్నట్లనిపించేది. మార్నింగ్ సెషన్ కాలేజి ఎనిమిదీ పదింటికి. తను కరెక్టుగా ఎనిమిది

గంటలకు''అలారం పీస్‌లా వచ్చేది. గార్డెన్‌లో నుండి చూస్తే మెయిన్‌గేట్ ఎంట్రన్స్‌నుంచీ కాలేజ్ హాల్ ఎంట్రన్స్ దాకా పూర్తిగా చూడొచ్చు. అదీ ముందు స్ట్రెయిట్ ఏంగిల్‌లో ఆ తర్వాత, సైడూ, బ్యాకూ...... '' అంటూ మరోసిప్ లాగించబోతూంటే, గ్లాసు తీసి ప్రక్కన పెట్టాడు రెడ్డి. విసుగ్గా చూసి లైన్లోకొచ్చేశాడు మళ్లీ సురేష్.

'' అప్పటికి మనం షోగ్గా పోజులు కొట్టడమే దప్ప, పిట్టల్ని గొట్టే స్టేజికి రాలేదు. దూరం నుంచి ఏమేమో జెయ్యాలనిపించేది. దగ్గరికెళ్తే కాళ్లల్లో వణుకు, గెండెల్లోదడ, నోట్లో నాలిక పెడపెడ. కానీ, రోజు రోజుకూ సుభద్రను సొంతం చేసుకోవాలనే ఆలోచన మాత్రం పెరిగిపోసాగింది. మార్గం తెలియదు. మనసు ఆగదు. చివ్వరికోరోజు కాలేజీనుండి వెళ్లేటప్పుడు ఫాలోజేశాను. మాయింటికి దగ్గర్లోనే అద్దింట్లో ఉంటోంది. అదీ మా బంధువులదే.

'ఓరోజు సుభద్రలేని సమయం చూసి వాళ్ళింటో కెళ్లాను. ఇంటావిడ నాకు అత్తవరుస. ఆమాటా ఈ మాటా మాట్లాడి సుభద్ర వివరాలు కనుకొన్నాను. మా క్యాస్టే. పైగా బంధువులుకూడా. నా ఆనందానికి మేరలేకుండా పోయింది.

''నా గమనంలో రెడ్‌లైట్ లేదని తెలసిపోయింది. మరోసారి సుభద్ర ఉన్నప్పుడే వెళ్ళాను. ' హలో' అంటే 'హాయ్' అంది. ఆ 'హాయ్' ఇప్పటికి నామనసులో మార్మోగుతూనే ఉంటుంది.

ఎందుకో ఆగిపోయాడు వాడు. మేమూ మాట్లాళ్లేదు.

''అలా మొదలైంది పరిచయం. ఎక్కువ చొరవజూపితే మొదటికే మోసం వస్తుందేమోనని అనుమానం. దూరం దూరంగా ఉంటే అసలే జారిపోతుందేమోనని భయం. ఈ ఊగిసలాటలో ఆ సంవత్సరం గడిచిపోయింది. సెలవులకు ఆమె వాళ్ల ఊరు వెళ్ళిపోయింది.

''ప్రయత్న పూర్వకంగా సెలవుల్లో వాళ్ల ఊరికెళ్లాను. ఆరోజు ఆ అమ్మాయికి పెళ్లిచూపులు. అది తెలియగానే నాకు కంపరం పుట్టినట్లైంది. అంతవరకూ ఉన్న జంకూ, అనుమానం పటాపంచలైపోయింది. వాళ్లింటికి వెళ్ళి నానా గొడవచేశాను. డైరెక్టుగా సుభద్ర దగ్గరికే వెళ్లి అడిగాను 'నేనంటే నీ కిష్టమా లేదా?' అని. '' 'ఇష్టమే' అంది.

''అయితే మా పెద్దల్నడిగి పెళ్ళికి ఒప్పిస్తానన్నాను. వాళ్ల తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. పైగా అమ్మాయిని చూడడానికి మరి కొద్ది సేపట్లో వస్తున్నారు. ఇలా గొడవపడటం బాగుండదు. ఈ సంబంధం ఖాయం గాకపోతే నీవన్నట్లే

చేద్దాం. ఈ రోజుకిక్కడే ఉండమని నన్ను బలవంతం చేశారు.

''వచ్చినవాడు అంటే చూడొచ్చినవాడు నాకంటే ఏరకంగానూ గొప్పగా లేడు. అయినా ఆ సంబంధం ఖాయమైంది. భారంగా వీడ్కోలు తీసుకుంటున్న నాకు చిరునవ్వుతో 'టాటా' చెప్పింది సుభద్రా'' ఇంకా చెప్పేందుకు విశేషమేమీ లేదన్నట్లు వాడు గ్లాసులో మిగిలిన ద్రవాన్నంతా గబుక్కున గొంతులోకి ఒంపేసుకున్నాడు.

''అలాగైతే, నీ కథ కర్ణుడితో కొంచెం సరిపోతుంది. నాది మాత్రం పూర్తిగా కర్ణుడి కథే! నేనూ కర్ణుడినే!'' అన్నాడు రాజేందర్‌రెడ్డి ఏదో మననం చేసుకుంటూ.

''ఒహో నీకూ ఓ కథుందా నాయనా కానీ మరి!'' అంటూ ప్రేరేపించాడు సలీమ్.

రెడ్డి చెప్పసాగాడు...

''అసలు నేను అనుకున్నది అనుకున్నట్లు జరిగితే ఇప్పుడిలా సెక్యూరిటీ గార్డులా దండాలుపెట్టే స్టేజిలో గాకుండా, ప్రపంచవ్యాప్తంగాకనీసం జాతీయ స్థాయిలో దండలేయించుకునే స్థితిలో ఉండేవాడ్ని.''

ఆశ్చర్యంగా చూశాం ముగ్గురమూ నమ్మలేనట్టు.

''మీరు నమ్మినా, లేకపోయినా అబద్ధం చెప్పే అవసరం నాకు లేదు.''

''నో! నో! క్యారీ ఆన్!'' మనఃపూర్వకంగా ఆమోదం చెప్పాను-నేను

''స్కూల్ డేస్‌లో 8వ తరగతి చదువుతున్న రోజుల్లో జింఖానా 'సి' క్లబ్‌లో మెంబర్ షిప్ ఉండేది నాకు. డేనియల్ రాజు అనే కోచ్‌ను క్లబ్బువాళ్లు కొత్తగా క్రికెట్ కోచ్‌గా అపాయింట్ చేశారు.

''ఆయనలో గొప్ప ట్యాలెంట్ ఉంది. క్షణాల్లో విద్యార్థుల ప్రతిభ గుర్తించేవాడు. మొదటిరోజే నా బౌలింగ్ యాక్షన్ చూసి ఇంప్రెసయ్యాడు. మిస్సైళ్ల వేగంతో బంతి విసిరే ట్యాలెంట్‌నేర్పించాడు. అతను చెబుతుంటే ఎంత కఠినమైన విషయమైనా చాలా తేలిగ్గా అనిపించేది.

యేడాది తిరక్కుండానే మంచి ఫాస్ట్ బౌలర్‌గా గుర్తింపొచ్చేసింది.

ఆ తర్వాత సంవత్సరం క్రికెట్ సీజన్లో స్టేట్ టీమ్ సెలక్షన్‌కోసం అండర్ సిక్స్‌టీన్ కాంపిటీషన్‌కి డేట్స్ వచ్చేశాయి. నిజానికి ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ అయినా క్లబ్ టీమ్‌లోని వాళ్లే ఎక్కువమంది సెలెక్ట్ అవుతారనేది బహిరంగ రహస్యం.

''ఆరోజు లిస్ట్ అప్రోవల్ ప్రపోజల్స్ పంపేరోజు, ప్రాక్టీసుకు ముందే నేనూ, ప్రవీణ్, కిరణ్, ఎజాజ్, విజయ్, డానీ ఫైనల్ లిస్ట్‌లో కూడా ఉంటామనే విషయం నిర్ధారణైపోయింది. చాలా ఉత్సాహంగా ప్రాక్టీస్ చేసాం. ఆనందంలో

వాషింగ్‌కోసం యూనిఫామ్ ఇంటికి తీసుకెళ్లాలనే సంగతి మరిచిపోయాను. బస్‌స్టాప్‌లో సడెన్‌గా గుర్తుకొచ్చింది. గబగబా పరుగెత్తుకొచ్చేశాను. వెనక్కి.

'' డ్రెసింగ్ రూమ్‌కెళ్లాలంటే ఆఫీసు ముందునుండే వెళ్ళాలి. ఏదో గొడవగా అనిపిస్తే ఆగిపోయి విన్నాను. నాగురించే'

ఒక్క క్షణం ఆగి సురేష్ వంక చూశాడు.

పెగ్గు దించేశాడు ఠక్కున.

''రాజు లేకుంటే బౌలింగ్ వీకవుతుంది నిజమే కాని, లేకున్నా మేనేజ్ చేసుకోవచ్చు సర్.'' ఆమాటలంటున్నది ఎవరోకాదు. మా ప్రియమైన కోచ్ డేనియల్ రాజే. మేనేజర్‌తో ఏదో రహస్యంగా చర్చిస్తున్నాడు. షాక్ తిగిలినట్లనిపించింది. నా చెవుల్ని నేను నమ్మలేక అలాగే నిలబడిపోయాను.

''అదేంటి డేనీ! రాజు మంచి ప్లేయర్ అని, ఫ్యూచర్ చాలా బాగుంటుందని ఇంతక్రితం దాకా నీవే అన్నావుగదా. ఇప్పుడు సడెన్‌గా ఇలా వాని పేరు తొలగిస్తే బాగుంటుందా, ఓసారి ఆలోచించు'' మేనేజర్ రామ్‌సింగ్ సానుభూతి వినిపించింది.

'' ఆ విషయాన్ని నేనిప్పుడు ఖండించడంలేదు గదా. వాడిలో ట్యాలెంట్ కేమీ కొదవలేదు. కాని, నాకూ కొన్ని వ్యక్తిగతాభిప్రాయాలుంటాయి. వాని రంగు, రూపు చూసి మావాడే అనుకున్నా. వాని పూర్తి పేరు ఇప్పుడు లిస్ట్ తయారు చేసే దాకా తెలీదు. ఆ కులం పేరువింటేనే నాకు ఎలర్జీ'' అంటూ ఏమేమో మాట్లాడాడు''.

ఆ తర్వాత రాజు చెప్పాల్సిన విషయం మేమూహించుకోగలిగాం. మా హృదయాలన్నీ బరువెక్కినట్లు వాతావరణంలోని గంభీరత చెప్పకనే బెబుతోంది.

ఆ తర్వాత సలీం కూడా దాదాపు ఇలాంటి కథే - మతం ప్రాతిపదికన తన తెనుగు భాషా జిజ్ఞాసను ఎవరెవరు ఎలా నీరసపరిచింది, చివరకు తానెలా నిలదొక్కుకున్నది చెప్పాడు.

మొత్తంమీద ఎంతో హ్యాపీగా గడపాలన్న మా ఆలోచనలు వికటించాయి. చీకటి పడటంతో మౌనంగా తిరుగు ప్రయాణమయ్యాం.

★ ★ ★

ఇల్లు చేరుకున్న నేను అన్యమనస్కంగానే భోజనం చేశాననిపించా. నిద్రపట్టలేదు. 'నేను కర్ణుణ్ణే' అంటూ నా అంతరాత్మ ఘోషించింది. జీవన గ్రంథంలోని పేజీలు ఒక్కొక్కటే వెనక్కి తిరిగి ఒకచోట ఠక్కున

ఆగిపోయాయి.

అవినేను యూనివర్సిటీలో పి.జి. ఫైనల్ చదువుతున్న రోజులు. మొదట్నుంచీ రాజకీయాలంటే అసహ్యించుకునే నాకు హాస్టల్ వాతావరణం నచ్చక అద్దె కొంపలో కాలం వెళ్ళ బుచ్చు తున్నాను. అయినా అందరూ నాకు స్నేహితులే. తెలుగు విద్యార్థుల్లోకూడా 'వాదప్రతిభ విభేదాలు తెచ్చింది. నేను అందరితో కలిసుండటం నాగేశ్వరరావు వాళ్ళ గ్రూపులో కూర్చొని సాహితీ చర్చ చేయడం నాకు మంచి కాలక్షేపం. తనకున్న సాహిత్యాభిమానం, సహకారగుణం నా మధ్యతరగతి మందహాసం-మామైత్రీబంధం పెనవేసుకు నేందుకు మరింత దోహదం చేశాయి.

ఓ నాటి రాత్రి శాస్త్రిగారి 'కృష్ణపక్షం' గురించి జోరుగా చర్చించు కుంటున్నాం. మాతోపాటు గణపతి శాస్త్రి, విఠల్‌రావు, ఆయన రూమ్‌మేట్స్ ఉన్నారు. సడెన్‌గా రోహిత్ వచ్చాడు.

''అన్నా! ఒక్కనిముషం!'' నాగేశ్వరరావు నుద్దేశ్యించిన పిలుపు రోహిత్ రొప్పుతున్నాడు. వాడు నాగేశ్వరరావుకి కజిన్.

వాడి పిలుపులోని ఆతృత గమనించి బయటికెళ్లాడు, నాగేశ్వరరావు. మరికొద్ది క్షణాల్లోనే లోపకికొచ్చాడు.

''ఒరేయ్ గణపతీ! విఠల్! గెట్‌రెడీ! మెటీరియల్ తీసుకోండి!'' కమాండర్ సైన్యానికిచ్చే ఆదేశాల్లా ఉన్నాయామాటలు. అలా అంటూనే డ్రెస్ మార్చుకున్నాడు.

క్షణాల్లో వాళ్లు యుద్ధానికి తయారయ్యే సైనికుల్లా చిన్నచిన్న ఆయుధాలు గుప్తంగా సిద్ధం చేసుకున్నారు. పైకి మాత్రం చాలా సింపుల్‌గా ఉన్నారు. రోహిత్‌లో ఆవేశం కంపనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నాగేశ్వరరావు కళ్లు ఎరుపెక్కాయి. ముఖం ఫూం కృత ఫణీంద్రున్ని గుర్తుకు తెస్తుంది. రూమ్ లాక్ చేస్తూ నా వైపు చూశాడు.

''వస్తావా?''అది అభ్యర్థనలాలేదు. మిత్రుని ఆదేశంలా ఉంది. ఎన్నోసార్లు నామధ్యతరగతి చిరుగుల చొక్కాకు అతుకులేసిన వాడు మైత్రికి ప్రాణమిచ్చేవాడు.

''పదండీ!'' మరో ఆలోచన లేకుండా బయలుదేరాను. వాళ్ల వెంబడి.

అది నడకకాదు పరుగే, వాళ్ల మనసుల్ని ప్రతిబించిస్తున్నది.

''వెంకట్‌గాడూ, విజయ్‌గాడూ ఎక్కడికెళ్లారట? నాగేశ్వరరావు- ఆరా.

''ఈరోజు కాకతీయతో వెళ్ళారట. రేపు ఉదయానికి గానీ రారు. రోహిత్ వివరణ.

''నాకొడుకు! ఎన్నాళ్లకు దొరికాడురా!'' పళ్లునూరాడు గణపతి.

''రూంకే బోదామ?'' విఠల్‌రావులో టెన్షన్.

''అదే బెటర్! పోలీసులొచ్చేలోపు పనైపోతుంది.

బెల్ట్ తడుముకున్నాడు నాగేశ్వరరావు. మరో పది పన్నెండు నిముషాల్లో హాస్టల్ రూం 103 దాపులకి చేరుకున్నాం. ఈ మధ్యకాలంలో వాళ్లు మాట్లాడుకున్న మాటలవల్ల ఇప్పుడు ఎటాక్‌కు గురికాబోతున్న తరుణ్ కుమారుతో ఎవ్వరికీ వ్యక్తిగత వైరంలేదని, వర్గ పోరాటమే నేపథ్యమనే విషయం నాకర్థమైంది. గణపతికి మాత్రం''తను ప్రేమించిన అమ్మాయికి'' లైనేస్తున్నాడన్న కక్షే ఉంది.

సమయం దాదాపు పదకొండు ఇరవై అయ్యుంటుంది. క్యాంపస్ అంతా నిశ్శబ్దంగా ఉంది. అడుగుల చప్పుడు మందగించి, నిశ్శబ్దంగా గది సమీపించాం. అది గ్రౌండ్ ఫ్లోర్ కావడం మాకు అనుకూలించిన మరో అంశం.

''నువ్వెళ్లి డోర్ నాక్ చేయి!'' గుసగుసగా నాతో అన్నాడు నాగేశ్వరరావు.

తలాడించాను-మరబొమ్మలా.

వణుకుతున్న చేతుల్తో తలుపుపై వేళ్లు ఆడించాను.

''ఎవరూ?'' లోపలినుంచి తరుణ్. ఇంకా నిద్రపోలేనట్టుంది. డోర్ తీయడానికొస్తున్న అలికిడి.

''నేను... కరుణాకర్‌ని''అక్షరాలు సమకూర్చుకుంటున్నట్లు నాకే స్పష్టంగా తెలుస్తోంది.

అనుమానం లేకుండా డోర్ తీశాడు.

మరుక్షణం సుడిగాలిలా నన్నూ, తరుణ్‌ని తోసుకుంటూ లోపలికి చొరబడ్డారు నలుగురూ. చివరగా ఎంటరైన గణపతి డోర్ లాక్ చేశాడు లోపలికొస్తూనే.

క్షణాల్లో పరిస్థితి అంచనా వేశాడు తరుణ్. ర్యాక్‌లో పుస్తకాల బొత్తు వెనుక సుమారు రెండడుగుల పొడవున్న కర్ర చేతుల్లోకి తీసుకున్నాడు.

అది పసిగట్టిన గణపతి అతన్ని వెనకనుండి బలంగా వాటేసుకున్నాడు.

ముందే ఊహించాడేమో తరుణ్, గణపతి పట్టు బిగుసుకోకుండానే ఎడమకాలు వంచి, పాదంతో వెనక్కి తన్నాడు. గురి తప్పలేదు. వెనక్కి విరుచుకుపోయాడు గణపతి.

అది చూసి కోపంతో రెచ్చిపోయాడు నాగేశ్వరరావు. నడుంకున్న బెల్ట్ లూప్సనుండి సర్రున చైన్ బయటకు తీశాడు.

అంతలో తన చేతిలో కర్రను హాఫ్‌రౌండ్ స్క్రూలా తిప్పి, కర్రను రెండుగా విడదీశాడు తరుణ్. తళుక్కున మెరిసింది, దాదాపు పదిహేను సెంటీమీటర్ల కత్తి.

విఠల్‌రావు ముందుకు దూసుకుని వచ్చి, తరుణ్ కుడిచేతిని కాలిమడమతో తొక్కేందుకు గాలిలో ఎగిరాడు. అది గమనించి పక్కకు తప్పుకున్నాడు తరుణ్. విఠల్ పుస్తకాల షెల్ఫ్‌కి తగిలి దబ్బున పడ్డాడు. కోపంతో తరుణ్ తలకు గురిచూసి చెయిన్ విసిరాడు నాగేశ్వరరావు.

ఒడుపుగా తప్పించుకొని ఎడమచేత్తో చైన్ పట్టుకున్నాడు తరుణ్.

అదే అదునుగా రోహిత్ తన వద్దనున్న చిన్న చాకుతో తరణ్ కడుపులో గుచ్చాడు. అతడు కొంచెం పక్కకు తప్పుకోవడంతో అతని నడుం ఎడమవైపు ఒరుసుకుపోయింది చాకు. చివ్వున రక్తం చిమ్మింది.

''య్యాహ్'' అంటూ గట్టిగా అరుస్తూ బలం కొద్దీ తన్నాడు రోహిత్‌ని తరుణ్. ఆ కిక్ సరిగ్గా రోహిత్ కుడి జబ్బకు తగిలింది.

'అబ్బా!' అంటూ అరూస్తూ చేయి పట్టుకొని కూలబడిపోయాడు రోహిత్.

నేను ప్రేక్షకుడిలా చేష్టలుడిగి చూస్తూన్నాను.

నాగేశ్వరరావు, తరుణ్ మధ్య పెనుగులాట మొదలైంది.

ఎడమ చేతిలోని చైన్‌ను దగ్గరగా లాక్కుంటూ నాగేశ్వర్రావుకు మరింత చేరువగా వచ్చేశాడు తరుణ్. ఇప్పుడు తరుణ్ వీపు నావైపున్నది. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో వచ్చిన నాగేశ్వరరావు ఈ హఠాత్‌పరిణామంతో ఖంగుతిన్నాడు. మొట్టమొదటిసారి అతని మొహంలోభయం కనిపించింది నాకు.

కుడిచేతిలోని కత్తిని పొజిషన్‌లోకి తెచ్చుకొనే ప్రయత్న చేస్తున్నాడు తరుణ్.

మరికొన్ని క్షణాలు ఆలస్యమైతే నాగేశ్వర్రావుకు చావు తథ్యం.

అప్పుడు పడింది నా చూపు, మూలనున్న క్రికెట్ బ్యాట్‌పై. గబుక్కున అందుకుని పక్కవాటంగా పట్టుకొని, బలం కొద్దీ తరుణ్ తలమీద మోదాను. మరుక్షణం మొదలు నరికి న చెట్టులా పడిపోయాడు.

అప్పటికే తేరుకున్న మిత్ర చతుష్టయం స్పృహలోలేని తరుణ్‌పై తమకసి తీర్చుకున్నారు.

నాపై మంచిబాలుడి ముద్ర ఉన్నందువల్ల, ఆ చతుష్టయం పరారీ వల్ల, హత్యానేరం నా దరిదాపుల్లోకి రాలేదు. కానీ, ఈ సత్యం జీవిత మంతానన్ను వెంటాడుతూనే వుంది.

నిజంగా నేనూ కర్ణుడినే! పద్మవ్యూహంలో అభిమన్యుడ్ని తప్పనిసరై పొట్టన పెట్టుకున్న వాడ్ని.

నిద్రకోసం వ్యర్థ ప్రయత్నం చేస్తూ పక్కమీద దొర్లసాగాను.